క్లుప్తంగా

సీఐటీయూ నేత సోమయ్య అరెస్టు అక్రమం



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సోమయ్య

ఏలూరు(టూటౌన్) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరఫున ఓటర్లకు సాయం చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్యను టూటౌన్ పోలీసులు టీడీపీ వారి ఒత్తిడికి తలొగ్గి అక్రమంగా అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద నిబంధన అనుసరించి ఓటర్లకు ఓటర్ల స్లిప్పులు అందించే సందర్భంలో టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు సోమయ్యను అన్యాయంగా టూటౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే పోలింగ్ స్టేషన్ లోపల నిబంధనలకు విరుద్ధంగా కూటమి అభ్యర్థి తరఫున పనిచేస్తున్న టీడీపీకి చెందిన వారిని పోలీసులు ఏమి అనకపోవడం కొసమెరుపు.

అలరించిన బుర్రకథ



బుర్రకథా గానం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రామచంద్రపురానికి చెందిన గొర్రెల కృష్ణమూర్తి ప్రధాన కథకునిగా, గొర్రెల రాము రాజకీయం, గొర్రెల శ్రీనివాస రావు హాస్యంతో గానం చేసిన బుర్రకథ ఆద్యంతం అలరించింది. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం చేశారు. సాయంత్రం నగరానికి చెందిన మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

సేలం బయలుదేరిన వాలీబాల్ జట్టు

దెందులూరు: సౌత్ జోన్ బాలుర వాలీబాల్ జీఎస్‌టీయూ కాకినాడ జట్టు గురువారం తమిళనాడు రాష్ట్రం సేలం బయలుదేరి వెళ్లింది. వేగవరం హేలాపురి సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏట కరుణ నిధి మాట్లాడుతూ సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికై న జేఎన్‌టీయూ కాకినాడ బాలుర జట్టుకు వేగవరం కళాశాల ఆతిథ్యం, శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. శిక్షణ ముగియడంతో తమిళనాడుకు జట్టు బయలుదేరి వెళ్లిందని వివరించారు.



పీడీబీటీ కళాశాలలో గుర్తింపు కార్డులు చూపిస్తున్న ఓటర్లు



సెయింట్ గ్జేవియర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



గాంధీనగర్ హైస్కూల్లో మహిళ వేలిపై సిరా వేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ పోలింగ్ సందడి

ఏలూరులో 20 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం నుంచే పోలింగ్ సందడి మొదలైంది. 11971 మంది ఓటర్లు ఉండగా, 52 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలూరు రూరల్ మండలంలో ఒక పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు కలెక్టరేట్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. కంట్రోల్ రూం నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. ఆయా జిల్లాల నుంచి పోలింగ్ సిబ్బంది తీసుకొచ్చే పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు ప్రత్యేకంగా రిసెప్షన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



పీడీబీటీ కళాశాలలో బిడ్డతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ





సెయింట్ గ్జేవియర్ హైస్కూల్లో ఓటు వేసేందుకు వస్తున్న మహిళలు



కౌంటింగ్ సెంటరును పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి



సెయింట్ గ్జేవియర్ హైస్కూల్లో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



పీడీబీటీ కళాశాలలో ఓటు వేసి వస్తున్న సీనియర్ సిటిజన్



గాంధీనగర్ హైస్కూల్లో ఓటర్ ఐడీని పరిశీలిస్తున్న పోలీసులు



గాంధీనగర్ హైస్కూల్లో పసుపు చొక్కాతో తిరుగుతున్న టీడీపీ నేత



సెయింట్ గ్జేవియర్ హైస్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో లైన్ల వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్‌లోని పెరుగు చెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు ఏరియా, హెడ్ పోస్ట్ ఆఫీసు ఏరియా, వైఎంహెచ్‌ఏ హాల్ ఏరియా, బిర్లా భవన్, మార్కెట్ ఏరియా, అగ్రహారం, రామకోటి, బాలాజీ థియేటర్, వెన్నవల్లివారి పేట, సత్యనారాయణ పేట, లంబాడిపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

- పత్తేబాద ఫీడర్ పరిధిలో నాలుగు గుడుల సెంటర్, మోతేవారితోట, అతిథి హోటల్ రోడ్డు, రైతు బజార్, శంకర్ మఠం, సుబ్బమ్మదేవి స్కూల్ ఏరియాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.
- చాటపర్రు విద్యుత్ సెక్షన్ పరిధిలో కొమడవోలు, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, ఆండాళ్లమ్మ తోట, రామనగర్, మారుతినగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	32	బీళ్ల చిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	80
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	68
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10-12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24-38	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివి

భీమడోలు: జ్యోతిష్య కేసరి, హంపీ పీఠం సిద్ధాంతి, పంచాంగకర్త కాళీబొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పోలసానిపల్లికి చెందిన కృష్ణ ప్రసాద్ శాస్త్రి (66) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. గురువారం పోలసానిపల్లిలోని ఆయన స్వగృహంలో ఆయన కుమారుడు పార్వతీశ్వర శర్మ, కుటుంబ సభ్యులను వాసు బాబు పరామర్శించారు. శాస్త్రి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. శాస్త్రి చేసిన సేవల వల్లే ఈ ప్రాంతానికి తగిన గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహకవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనువాసరావు, నాయకులు పసుపులేటి సత్యనారాయణ, చిలపర్తి రామారాయుడు, అంబటి నాగేంద్ర ప్రసాద్, చెరుకూరి మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం

- పట్టపగలు, నడిరోడ్లపైనే తాగేస్తున్నారు
- బస్సు స్టాప్‌ల వద్ద మద్యం షాపులు
- మహిళల భయాందోళన
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకొనే నాథుడు లేడు



తంగెళ్లమూడి బస్‌స్టాప్ వద్ద మందుబాబులు



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో బస్టాండ్ వద్ద మద్యం షాపు

ఏలూరు రూరల్ : ఏటండీ మాకీ ఖర్మ. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బస్‌స్టాప్ వద్ద మందుబాబులతో నరకం చేస్తున్నాం. తప్పతాగి వచ్చి మహిళలపై పడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే. ఏం చేస్తారేమోనని భయం. వీళ్లకు బయపడి బస్ కోసం ఎదురుచూడలేక, ఆటో ఎక్కి వెళ్లి పోతున్నాం. ఒక్క రోజుయితే భరిస్తాం. రోజూ ఇదే తంతు. 10 నిమిషాలు కూడా బస్ స్టాప్ వద్ద నిలబడలేకపోతున్నాం. మా సమస్యలు పట్టించుకునే నాథుడే లేడా.. ఇదీ ఏలూరుకు చెందిన ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలి ఆవేదన.

తాగుబోతుల హల్‌చల్

ఏలూరు నగరం తంగెళ్లమూడి సెంటర్‌లో బస్‌స్టాప్ వద్ద మద్యం షాపు ఉంది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఇక్కడ నుంచే బస్ ఎక్కి ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ స్కూళ్లకు వెళుతుంటారు. తిరుగు ప్రయాణంలో సైతం ఇక్కడే దిగి ఇళ్లకు చేరుతారు. సరిగ్గా ఉపాధ్యాయులతో పాటు మహిళా ప్రయాణికులు బస్ ఎక్కే సమయానికి మందుబాబుల హడావుడి మొదలవుతుంది. ఫూటుగా తాగి మహిళల మధ్య హల్‌చల్ చేస్తున్నారు. తూగుతూ, తూలుతూ మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మరికొందరు ఆకతాయిలు అసభ్యకరంగా మాట్లాడుతూ మీదపడే ప్రయత్నం చేస్తున్నారు. షెల్టర్ వద్దకు మందు తెచ్చుకుని తాగుతున్నారు. దీంతో షెల్టర్ వదిలి, రోడ్డుపైనే ఎండలో నిలబడి బస్ వచ్చేంత వరకు తాగుబోతుల వికృత చేష్టలు భరించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

జనావాసాల మధ్యే మద్యం అమ్మకాలు

ఏలూరు నగరంలో అనేక మద్యం షాపుల పరిసరాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్, నవయుగ హోటల్ వద్ద సైతం ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ బస్‌స్టాప్ వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు వేచి ఉంటారు. ఉదయం, సాయంత్రం మందుబాబులు ఆరుబయట షాపుల వద్దే మద్యం తాగుతుండడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. వారి నుంచి దూరంగా వెళ్లి నిలబడి, బస్ రాగానే పరుగెత్తుకొచ్చి బస్సెక్కి వెళుతున్నారు. గజ్జలవారి చెరువు, చేపల తూము సెంటర్, కట్టా సుబ్బారావుతోట, డీమార్ట్ ప్రధాన రోడ్ల పక్కన ఉన్న మద్యం షాపుల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్‌స్టాప్ వద్ద మద్యం షాపులు వద్దు



బస్‌స్టాప్ వద్ద మద్యం షాపులను తీసేయాలి. తాగిన మైకంలో కొందరు వ్యక్తులు మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవరిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించలేం. ఏమైనా అంటే ఏం చేస్తారేమోనని భయం. మహిళలు బస్సు కోసం ఎదురు చూసేందుకు భయపడుతున్నారు. ఆడ పిల్లలు ఇంటి వచ్చే వరకు భయం భయంగా ఎదురుచూడాల్సి వస్తుంది.

– ఆర్ విజయమ్మ

రోడ్డుపైనే తాగుతున్నారు



కొందరు పట్టపగలు షాపుల వద్దే మద్యం తాగుతున్నారు. ఇది చూసి మహిళలు భయపడిపోతున్నారు. మద్యం షాపు ఉన్న రోడ్డుపై వెళ్లడానికి నానా హైరానా పడుతున్నారు. గతంలో ఊరికి దూరంగా మద్యం, సారా షాపులు ఉండేవి. ఇప్పుడు ఊరు మధ్యలోనే యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. అక్కడే మందుబాబులు తాగుతున్నారు. దీనిని పట్టించుకొనేవారు లేరు.

– పులి కళ్యాణరావు

జ్ఞానజ్యోతి.. భవితకు నాంది

- అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
- ప్రీ ప్రైమరీ చిన్నారులకు మెరుగైన బోధన



దెందులూరు హైస్కూల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆట పాటలతో చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను కర్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతుల్లో బోధించడం వల్ల చిన్నారుల జీవితాల్లో వెలుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషన్ బీ, పడాయి బీ పథకం అమలుపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి అనుగుణంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖ పటిష్ట కార్యాచరణను రూపొందిస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో పునాది

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్‌ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0 నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన - బడి, నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు ప్రతి కేంద్రానికీ ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

మాత, శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ సర్వశిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాంలలో భాగంగా పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పెదవేగి మండలంలో 73, పెదపాడు 56, దెందులూరు 63, ఏలూరు రూరల్ మండలంలో 34 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. దీంతో పెదవేగి మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 2140 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 2031 మంది, పెదపాడు మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1444 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 736 మంది, దెందులూరులో 6 లల నుంచి మూడేళ్లలోపు 1601 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 1571 మంది చిన్నారులు ప్రయోజనం పొందనున్నారు.

శిక్షణ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక సామాజిక భావోద్వేగం నైతికత, మేధాభివృద్ధి, భాష - అక్షరాస్యత, సౌందర్య - సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రమాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120 రోజులు శిక్షణ ఇస్తున్నారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. ఈ వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20 రోజులు, మలి దశలో 20 రోజుల చొప్పున కొనసాగుతున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు.

సులభతర బోధన



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా బోధన చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక విద్యను 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.

– పి.శారద, పీడీ, జిల్లా మహిళా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం

ఎంతో ఉపయోగం



చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే పాఠశాలలకు వస్తారు. అందువల్ల ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.మేరీ బాయమ్మ, సూపర్ వైజర్, విజయరాయి సెక్టార్ ఐసీడీఎస్